క్లుప్తంగా

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

కలసపాడు : మండలంలోని విద్యుత్ వినియోగదారులు, ప్రజలు వర్షాకాలంలో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ బ్రహ్మానందరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షంలో తడిసిన స్తంభాలను ముట్టుకోవద్దని, విద్యుత్ లైన్లు చెట్టు కొమ్మలు తగుతుంటే గమనించి విద్యుత్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు విద్యుత్ స్తంభాలు ముట్టుకోరాదన్నారు. అలాగే ఇంట్లో ఉన్న స్విచ్‌బోర్డులను తడి చేతులతో ముట్టుకోకూడదన్నారు. ఉతికిన బట్టలు ఇనుప తీగలపై ఆరేయకూడదని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి

ప్రొద్దుటూరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్ రెడ్డి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో గురువారం హరిత భారత్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం నాగిరెడ్డి, ప్రిన్సిపాల్ రహమతుల్లా, డీన్ పవన్ కుమార్, ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ హేమాంజలి పాల్గొన్నారు.

సబ్సిడీతో టమాటాలు ఇవ్వాలి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలో టమాటాల సబ్సిడీ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాక ప్రతాప్‌రెడ్డి గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రాఘవేంద్రనాథ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సబ్సిడీ టమాటాలను విక్రయిస్తున్నారని, ప్రొద్దుటూరులో మాత్రమే ఏర్పాటు చేయలేదన్నారు. గతంలో ధరలు పెరిగినప్పుడు ఎర్రగడ్డలను అమ్మారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్మిక సమాఖ్య ప్రొద్దుటూరు అధ్యక్షుడు యల్లయ్య పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని డి.నేలటూరు గ్రామ సచివాలయం వద్ద గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మణ్యం శంకర్‌రెడ్డి తాగు నీటి కోసం బోరును ఏర్పాటు చేశారు. నూతనంగా నిర్మించిన సచివాలయానికి తాగు నీటి సమస్య రాకుండా ఉండేందుకు బోరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ , జెడ్పీటీసీ ఎంపీడీఓ లతో మాట్లాడి త్వరలో నూతన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలపారు.

రాజోలి ఆనకట్టకు వర్షం నీరు



రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి పోతున్న నీరు

రాజుపాళెం : ప్రస్తుతం కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పలు గ్రామాల్లో కురుస్తున్న వర్షం నీరంతా రాజుపాళెం మండలంలోని రాజోలి ఆనకట్టకు భారీగా వచ్చి చేరుతోంది. గతంలో ఆనకట్టలో 350 క్యూసెక్కులు మాత్రమే ఉండగా గురువారం ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 5472 క్యూసెక్కులు నీరు పోతోందని కేసీ కెనాల్ అధికారులు తెలిపారు. అయితే ఇదంతా వర్షం నీరేనని, రైతులంతా గమనించుకోవాలని ఆశాఖ అధికారులు సూచించారు.

ఆర్యవైశ్యులకు ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు అవోపా ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి మగ్గం వర్క్, కోలాటం, ఎంఎస్ ఆఫీస్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అవోపా అధ్యక్షుడు గుండా పద్మనాభయ్య, కార్యదర్శి పచ్చిపులుసు నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్య మహిళలు, విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను పాత మార్కెట్‌లోని శ్రీధనలక్ష్మి మెడికల్‌స్టోర్స్‌లో లభిస్తాయని వారు పేర్కొన్నారు. ఈ నెలాఖరులోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఆగస్టు 1న జెడ్పీ అద్దె గదుల వేలం

మైదుకూరు : స్థానిక కడప రోడ్డులోని జిల్లా పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని అద్దె గదులను వేలం వేయనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ ఎం.సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పంచాయతీ రాజ్ కార్యాలయం వద్ద ఉన్న మూడు గదులను అద్దెకు ఇచ్చేందుకు ఆగస్టు 1న ఉదయం 10 గంటలకు కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న డీపీఆర్‌సీ బిల్డింగ్‌లో ఈ వేలం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని, వేలం పొందిన వారు రూ.2లక్షలు అడ్వాన్స్‌ను నాలుగు కంతులుగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



శ్రీరాములపేట ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇంటింటికి వస్తున్నామని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దగురువకూరు, శ్రీరాములపేట గ్రామాలలో గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వేమారెడ్డి, సర్పంచ్ రాజేష్ రెడ్డి, నాగిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఇదే క్రమంలో ప్రతి ఇంటికి సంక్షేమ బావుట బుక్‌లెట్‌ను అందజేసి ప్రభుత్వ లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వ పథకాల మంజూరుతో పాటు ఆయా ప్రాంతాలలో ఉండే స్థానిక సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారమవుతాయన్నారు. శ్రీరాములపేటలో విద్యుత్ లైన్ల సమస్యను, ఎస్సీ కాలనీలో ఇళ్లపై వెళ్లే 33/11 కేవీ విద్యుత్ లైన్లు మార్పు చేయాలని స్థానికులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా ఆదేశించారు. గతంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇటీవల శ్రీరాములపేటలో రూ.8.50 లక్షలతో నిర్మించిన కేసీ కెనాల్ కాలువను పరిశీలించారు. కార్యక్రమంలోఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రామోహన్ రెడ్డి తహసీల్దారు సుభానీ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఏఓ మ్యాగి తదితరులు పాల్గొన్నారు.

తండ్రితో కలసి నాగిరెడ్డి..

ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేలా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తో పాటు తనయుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

రూపాయి లేకుండా సర్టిఫికెట్లు మంజూరు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



రైస్ కార్డు ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా రూపాయి లేకుండా ఉచితంగా ప్రజలకు వివిధ రకాల సర్టిఫికెట్లను మంజూరు చేయడం జరుగుతోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉప్పరపల్లె గ్రామంలో గురువారం సర్పంచ్ సానపురెడ్డి రమణారెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో కొన్ని వేల మందికి ప్రభుత్వం ఉచితంగా సర్టిఫికెట్లను మంజూరు చేసిందన్నారు. దరఖాస్తు చేసిన నాలుగు రోజుల్లోనే సర్టిఫికెట్లను మంజూరు చేసి వలంటీర్ల ద్వారా ఇళ్లకు పంపించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఆర్‌ఐ నాగమోహన్‌రెడ్డి, వీఆర్‌ఓ జహిరుద్దీన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి



రాచాయపేట సచివాలయంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

గోపవరం : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాచాయపేట సచివాలయంలో అన్నిశాఖల అధికారులతో కలిసి సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు వివిధ పనులపై ఎమ్మెల్యే డాక్టర్ సుధ దృష్టికి తీసుకొచ్చారని, వాటన్నింటికీ ఆమోదం లభించిందన్నారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ అనుమతితో పనులు చేపట్టాలన్నారు. అలాగే పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు ఆసక్తి కలిగిన రైతులు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ-పంట నమోదు పక్కాగా జరగాలని, వ్యవసాయ, రెవెన్యూ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ నాగేంద్ర, ఎంపీడీఓ హరినారాయణ, ఈఓపీఆర్డీ హసీనా, పీఆర్ ఏఈ చిట్టిబాబు, డీడీఓ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి లిఖిత తదితరులు పాల్గొన్నారు.

మంచితనానికి మారుపేరు గోపాల్‌రెడ్డి



పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయానికి వితరణ అందజేస్తున్న ఎమ్మెల్సీ, గోపాల్‌రెడ్డి కుమారులు

బద్వేలు అర్బన్ : మంచితనానికి మారుపేరుగా నిలిచిన మహోన్నత వ్యక్తి సానపురెడ్డి గోపాల్‌రెడ్డి అని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బోవిళ్లవారిపల్లె గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎస్.గోపాల్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం బోవిళ్లవారిపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారు ఉన్నతస్థాయికి ఎదిగేందుకు గోపాల్‌రెడ్డి అహర్నిశలు శ్రమించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్తలు, గోపాల్‌రెడ్డి కుమారులు ఎస్.రాంగోపాల్‌రెడ్డి, ఎస్.రాధాకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, అడా చైర్మన్ గురుమోహన్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, గిద్దలూరు ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ బి.మునెయ్య, రూరల్ నాయకులు పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ కార్యాలయానికి వితరణ

సానపురెడ్డి గోపాల్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు రాంగోపాల్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డిలు పెన్షన్ అసోసియషన్ కార్యాలయ అభివృద్ధి పనులకు రూ.5.16 లక్షలు విరాళంగా ప్రకటించారు. గురువారం రూ.1.16 లక్షల చెక్కును ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి చేతులమీదుగా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మీనాక్షి రెడ్డి, కె.బ్రహ్మయ్యలకు అందజేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చాపాడు : మండలంలో పెద్దగురువకూరు పంచాయతీ పరిధిలోని ఓబుళరెడ్డిపేటలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య తెలిపారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొంటారన్నారు.

ఘన నివాళి

బద్వేలు అర్బన్ : బద్వేలుకు చెందిన సీనియర్ పాత్రికేయుడు పందుగాయల రామయ్య (47) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, అడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డిలతో పాటు పలువురు వివిధ పార్టీలకు చెందిన నాయకులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

తెలుగు గంగ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

మైదుకూరు : మైదుకూరు మండలంలో గతంలో తెలుగుగంగ పథకం కోసం సేకరించిన భూములను ఆక్రమించడంపై ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు జాతీయ ఉద్యానవన పరిశోధన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఉల్లి పరిశోధనా కేంద్రానికి తెలుగుగంగ అధీనంలో ఉన్న భూములను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ మేరకు ఉద్యాన శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కలెక్టర్‌కు ఉత్తరం రాశారని తెలిపారు. తెలుగు గంగ భూములను ఉల్లి పరిశోధన కేంద్రానికి కేటాయించేందుకు వీలుగా, గంగ భూముల ఆక్రమణపై లోకాయుక్తను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత



ఉపాధి పనులపై సామాజిక బహిరంగ సభ నిర్వహిస్తున్న అధికారులు

చాపాడు : రైతులకు ఉపయోగపడే ఉపాధి పనులకు ప్రాధాన్యత కల్పించాలని ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద గురువారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలో అధికంగా కేసీ కెనాల్, కుందూనది పరీవాహకంలో వ్యవసాయ సాగు భూములు అధికంగా ఉన్నాయన్నారు. ప్రతి ఏటా చేపట్టే ఉపాధి పనులు వ్యవసాయానికి ఉపయోగపడేలా చేపట్టాలని సూచించారు. అనంతరం ఉపాధి పథకం జిల్లా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరత్నమ్మ పర్యవేక్షణలో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేది వరకు మండల వ్యాప్తంగా జరిగిన రూ.6.85కోట్లతో జరిగిన 1510 పనులపై సామాజిక తనిఖీపై బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్, ఎస్సార్‌పీ లక్ష్మీనారాయణ, ఉపాధి ఏపీడీ మైథిలి, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఉపాధి ఏపీఓ పద్మారాణి, ఈసీ ప్రియాంక, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ల ప్రారంభం

దువ్వూరు : మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలను శుక్రవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించనున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

ఉనికి కోసమే ప్రవీణ్ విమర్శలు



మాట్లాడుతున్న కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : కేవలం రాజకీయ ఉనికి కోసమే ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి పదే పదే విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి అసూయతో ప్రవీణ్‌కు మతి భ్రమించిందన్నారు. నిరుపేదల ఇంటి స్థలాల కోసం రూ.200 కోట్లు ఖర్చు పెట్టి 500 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. 24వేల మందికి ఇంటి పట్టాలు అందించామని, ఇప్పటికే కొన్ని ఇళ్లు పూర్తయ్యాయన్నారు. వీటిలో 16వేల ఇళ్ల నిర్మాణం జోరుగా జరుగుతోందని, ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా ఎమ్మెల్యే అభివృద్ధి చేస్తుంటే ప్రవీణ్ అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో మంజూరు చేసిన సంక్షేమ పథకాలు అతి స్వల్పమన్నారు.

మణిపూర్ బాధితులను కాపాడాలి



అంబేద్కర్ సర్కిల్‌లో ర్యాలీ

పోరుమామిళ్ల : మణిపూర్‌లో జరుగుతున్న దమన కాండకు వ్యతిరేకంగా, బాధితులకు అండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్య తీసుకోవాలని బుద్దిస్ట్ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షులు ఇండ్ల రామసుబ్బయ్య కోరారు. గురువారం అంబేద్కర్‌భవన్‌లో బుద్దిస్ట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రామసుబ్బయ్య మాట్లాడారు. కుల, మత, జాతి వర్గాలకు అతీతంగా ప్రభుత్వాలు శాంతియుత పరిస్థితులు కల్పించాలన్నారు. అంతకు ముందు అంబేద్కర్ సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బుద్దిస్ట్ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఇండ్ల రాజమ్మ, స్వర్ణ రాజమ్మ, ఖాశింఖాన్, నాగూర్‌వలి, డప్పు కళాకారుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామలక్షుమయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సమావేశం



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి సురేష్‌రెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల ప్రత్యేక అధికారి, మెప్మా పీడీ సురేష్ రెడ్డి అధ్యక్షతన సీజనల్ వ్యాధులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్యశాఖ, వెలుగు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇన్‌చార్జి ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రహమతుల్లయ్య, కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, మండల ఆరోగ్య నోడల్ అధికారి వెంకటేష్, హెచ్‌ఈ శోభారాణి, ఎంపీహెచ్‌ఈఓ రాజశేఖర్, సూపర్‌వైజర్ వరప్రసాద్, ఈఓపీఆర్డీ శేఖర్‌రెడ్డి, వెలుగు ఏపీఎం వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు

బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సగిలేరు బి.ఆర్.అంబేద్కర్ గురుకులం జూనియర్ కళాశాలలో గురువారం వైస్ ప్రిన్సిపల్ శ్రీరాములు ఆధ్వర్యంలో వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు ఆదేశాల మేరకు గురువారం వైద్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించారు. జ్వరం, దగ్గు, జలుబు, కడు పునొప్పి, విరేచనాలు ఉన్న విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. పాఠశాల ఆరోగ్య పర్యవేక్షకులు బాలయ్య, కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం



సర్టిఫికెట్లతో విద్యార్థులు, అధ్యాపకులు

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలి విడత శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు మాట్లాడుతూ పోరుమామిళ్ల పరిసర ప్రాంత విద్యార్థులు స్కిల్‌హబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా భవిష్యత్‌లో మంచి ఉపాధి అవకాశాలు పొందాలని కోరారు. సమావేశంలో అధ్యాపకులు వెంకటరావు, శ్రీధర్‌మూర్తి, శివారెడ్డి, పీరయ్య, హరిబాబు, నరసింహారెడ్డి, స్కిల్ హబ్ శిక్షకులు మోహన్‌కుమార్, సుహాసిని పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ సాధన కోసం 31న ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

మైదుకూరు : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 31న కడప కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తున్నట్టు సీపీఎం నాయకులు పేర్కొన్నారు. గురువారం మైదుకూరులోని సుందరయ్య నగర్‌లో నిర్వహించిన సమావేశంలో సీపీఎం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక హోదాతోపాటు విభజన చట్టంలోని హామీలన్నీ తుంగలో తొక్కిందని ఆరోపించారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం రాయలసీమ ప్రాంతంలోని నిరుద్యోగులు, ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నా, బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను విస్మరిస్తోందని ధ్వజమెత్తారు. ఈనెల 31న కడప కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు, నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శివకుమార్, మైదుకూరు మండల కార్యదర్శి షరీఫ్, నాయకులు రాయప్ప, రవి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బత్తుల ఏకోనారాయణకు ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. క్రీస్తు శకం 1300 నుంచి 1600 సంవత్సరం వరకు సోషియల్ లైఫ్ ఇన్ ఆంధ్ర అన్న అంశంపై పరిశోధన చేశారు. వెంకటేశ్వర యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రయోగ పర్యవేక్షణలో పరిశోధన చేశారు.

వరి సాగులో కొత్త వంగడాలపై శిక్షణ



కొత్తవంగడాలపై రైతులకు శిక్షణ

పోరుమామిళ్ల : వరి సాగులో ఇటీవల వచ్చిన కొత్త వంగడాలను రైతులు సాగు చేసి లబ్ధి పొందాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు మురళీధర్ రెడ్డి కోరారు. గురువారం దమ్మన్నపల్లె రైతు భరోసా కేంద్రంలో కొత్త వంగడాలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేఎన్‌ఎం-1638, కేజీఎల్-381 రకాలు సాగు చేయాలన్నారు. ఈ రకాలు దుబ్బు దోమ, ఉల్లికోడు తట్టుకుంటాయన్నారు. మండల వ్యవసాయాధికారి వరహరిరావు రైతులకు వరిలో ఎరువుల యాజమాన్యం, చీడపీడల యాజమాన్యం గురించి వివరించారు. ఉద్యాన పంటల ఆవశ్యకత, సూక్ష్మ నీటి పద్ధతుల గురించి హార్టికల్చర్ అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. సమావేశంలో వ్యవసాయ సిబ్బంది సునీల్, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

నేలటూరులో భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు



నేలటూరులో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



గుండాపురంలో కొలువుదీరిన పీర్లు

దువ్వూరు : మండల పరిధిలోని నేలటూరులో గురువారం భక్తి శ్రద్ధలతో పీర్లను ఊరేగించారు. బాదుల్లా, మౌలాలి పీర్లను గ్రామ పుర వీధుల గుండా డప్పులు, వాయిద్యాల నడుమ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. హజ్రత్ ఇమాంహుస్సేన్‌ను స్మరించుకుంటూ పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండం చుట్టూ భక్తులు తిరిగారు. ఊరేగింపు సమయంలో గ్రామంలోని ప్రజలు ఫాతెహా చదివించారు. అలాగే మండల కేంద్రంలోని దువ్వూరుతో పాటు గుడిపాడు తదితర గ్రామాల్లో కూడా పీర్లను ఊరేగించారు.

కొలువుదీరిన పీర్లు

బ్రహ్మంగారిమఠం : మోహర్రం వేడుకల్లో భాగంగా గ్రామాల్లో పీర్లు కొలువుదీరాయి. గురువారం నుంచి నాల్గురోజుల పాటు పీర్ల పండగ నిర్వహించనున్నారు. సోమిరెడ్డిపల్లె, పలుగురాళ్లపల్లె, ఓబులరాజుపల్లె, గుండాపురం, రాజుపేట, తదితర గ్రామాల్లో ఘనంగా పీర్ల పండగ నిర్వహిస్తారు. మొదటి రోజు చిన్న సరిగెత్తు అలంకరణలో పీర్లను ఊరేగించారు.

విద్యుత్ కార్మికుల ఆందోళన

మైదుకూరు : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం మైదుకూరు విద్యుత్ డివిజన్ కార్యాలయం ఆవరణలో విద్యుత్ కార్మికులు, ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. డివిజన్‌లోని మూడు సబ్ డివిజన్లలోని అన్ని కార్యాలయాలకు చెందిన కార్మికులు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, డిమాండ్ల ప్లకార్డులు చేతబట్టి గురువారం ఆందోళన నిర్వహించారు. ఏపీఎస్‌పీఈజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళన సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలు గతంలో కార్మిక, ఉద్యోగ సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయాలనే డిమాండ్‌తో దశలవారిగా ఆందోళన చేపట్టేందుకు జేఏసీ నిర్ణయించిందని తెలిపారు.

ఉక్కు పరిశ్రమపై మరో ఉద్యమం

ప్రొద్దుటూరు : జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకొని మరో ఉద్యమాన్ని చేపడుతామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య తెలిపారు. పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాతోపాటు రాయలసీమ జిల్లాలలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం బ్రహ్మణి స్టీల్ ప్లాంట్‌కు వైఎస్ఆర్ శంకుస్థాపన చేశారన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో ఉక్కు పరిశ్రమను నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు కేవలం శంకుస్థాపనకు పరిమితమయ్యారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్, నాయకులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓలలో రైతులు చేరితే ప్రయోజనం



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త శ్రీవిద్యారాణి

మైదుకూరు : రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ)లలో రైతులకు చేరితే ఎంతో ప్రయోజనమని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవిద్యారాణి అన్నారు. కేవీకేలో గురువారం పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి నిధుల విడుదల సందర్భంగా రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 14వ విడత నిధులు విడుదల చేయడం జరిగిందని అన్నారు. రైతులు తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు ఎఫ్‌పీఓలలో చేరాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ హర్షిత, డాక్టర్ క్రాంతిశ్రీ, డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్, డాక్టర్ లావణ్య, వనిపెంట ఎంపీటీసీ ఇర్షాద్, సర్పంచ్ గౌస్ లాజం, వ్యవసాయ అధికారి పద్మజ, కోర మండల్ ఏరియా మార్కెటింగ్ మేనేజర్ గంగయ్య, వనిపెంట ఎఫ్‌పీఓ అధ్యక్షుడు బాల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.